# 'కాశ్మీర్ సమస్య' గురించి
# ఇంకొక కోణం తెలుసుకుందాం రండి!

## బహిరంగ సభ

**తేదీ**

ఆగస్ట్ 30 గురువారం సా.6.00 గంటలకు.

**స్థలం**

సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.

**వక్తలు**

అబ్దుల్ గనీలోన్

అబ్దుల్ మజీద్ బాందే

(హురియత్ కాన్ఫరెన్స్)

ఈ మధ్య జరిగిన ఆగ్రా శిఖరాగ్ర చర్చల సందర్భంగా ఆల్‌పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ పేరు అందరూ విన్నారు.

అది కాశ్మీర్‌కు చెందిన రాజకీయ వేదిక అనీ, మిలిటెంట్ సంస్థలకు రాజకీయంగా సన్నిహితమైన వేదిక అనీ అందరికీ అర్థం అయ్యే ఉంటుంది.

అంతకు మించి హురియత్ కాన్ఫరెన్స్ గురించిగానీ ఆ సంస్థ అభిప్రాయాల గురించిగానీ మనకు తెలిసింది తక్కువ. తెలిసిన మేరకు ఆ సంస్థ పాకిస్తాన్‌కు అనుకూలమనీ కాశ్మీర్‌ను పాకిస్తాన్‌లో కలపడం ఆ సంస్థ అజెండా అనీ చాలా మంది అభిప్రాయం.

ఈ అభిప్రాయానికి మూలం ఏమిటని అడిగితే మాత్రం ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే హురియత్ కాన్ఫరెన్స్ అభిప్రాయాలు ఎవరూ వినలేదు. హురియత్ కాన్ఫరెన్స్ గురించి భారత ప్రభుత్వం చెప్పే విషయాలు, మన పత్రికలలో రాజకీయ విశ్లేషకులు చేసే వ్యాఖ్యలు మాత్రమే మనం ఎరుగుదుము.

నిజానికి హురియత్ కాన్ఫరెన్స్‌లో 20కి పైగా సంస్థలున్నాయి. వాటన్నిటికీ ఉన్న సామాన్యగుణం ఒక్కటే. 1947 అక్టోబర్ 26న జమ్ము కాశ్మీర్ రాజు ఆ రాష్ట్రాన్ని భారత్‌లో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం ప్రజాభీష్టాన్ని వ్యక్తం చేసే నిర్ణయం కాదనీ ఆ రాష్ట్ర ప్రజల ఆమోదం పొందిన నిర్ణయమే తుది నిర్ణయం కాగలదనీ ఆ సంస్థలన్నీ నమ్ముతాయి. ఆ నిర్ణయాన్ని తెలియజేసే అవకాశం ప్రజలకివ్వాలన్నది వారి డిమాండు.

ఇంకొక రకంగా చెప్పాలంటే 'కాశ్మీర్ విలీనం' వివాదాస్పదమైనది అని హురియత్ కాన్ఫరెన్స్‌లోని సంస్థలన్నీ నమ్ముతాయి. ఆ వివాదం కాశ్మీర్ ప్రజల అభీష్టాన్ని అనుసరించి పరిష్కారం కావాలని కూడా నమ్ముతాయి.

అది వివాదాస్పదమైనది అని నమ్మడానికి వారెవరు అని ఆవేశపడేవాళ్లు చాలా మంది ఉంటారు. ఆవేశపడకుండా వారి మాటలు వినమని మేము కోరుతున్నాము. విలీన ఒడంబడిక పైన కాశ్మీర్ రాజు సంతకం చేసిన వాడే, అదే తుది నిర్ణయం కాదనీ ప్రజల సమ్మతి మీద అది ఆధారపడి ఉంటుందనీ భారత ప్రభుత్వం అంగీకరించింది. ఆ 'సమ్మతి'ని నిర్ణయించడానికి రెఫరెండమ్ లేక ప్లెబిసైట్ రూపంలో ప్రజాభిప్రాయసేకరణ చేయడం జరుగుతుందని భారత ప్రభుత్వం కాశ్మీర్ ప్రజలకేకాక ఐక్యరాజ్యసమితికి

కూడా హామీ ఇచ్చింది.

ఆ హామీ ఏమయింది? ఆ తరువాత ఏం జరిగింది? ఆ హామీని అమలు చేయాలని పట్టుబట్టిన వారి స్వేచ్ఛకు ఏం గతి పట్టింది?

విలీనానికి ప్రజల సమ్మతి తీసుకుంటామని హామీ ఇవ్వడమేకాక, ఆనాడే భారత ప్రభుత్వం ఇంకొక హామీ కూడా ఇచ్చింది. అదేమిటంటే ఆ రాష్ట్రానికి స్వయంప్రతిపత్తి కల్పిస్తామన్న హామీ. ఈ హామీ విలీన ఒడంబడికలో అంతర్భాగమే. దాని పర్యవసానమే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370. స్వయంప్రతిపత్తిని మరికొంత వివరిస్తూ 1952లో షేక్ అబ్దుల్లాకూ నెహ్రూకూ జరిగిన ఒడంబడిక (దీనిని ఢిల్లీ ఒప్పందం అంటారు) దానికి కొనసాగింపే.

ఈ స్వయంప్రతిపత్తి ఏమయింది? ఈ రోజున అది కాగితం మీద కూడా మిగలక పోవడానికి కారణం ఏమిటి? దాని గురించి కాశ్మీరీలు ఏమనుకుంటున్నారు? స్వయంప్రతిపత్తిని తిరిగి 1952 ఒప్పందం రూపంలో పునరుద్ధరించాలని కాశ్మీర్ అసెంబ్లీ ఇటీవల చేసిన తీర్మానాన్ని కేంద్రం కనీసం చర్చ జరపకుండా తిరస్కరించడం గురించి కాశ్మీరీలు ఏమనుకుంటున్నారు?

తమ భవితవ్యాన్ని తామే నిర్ణయించుకోవాలన్న పట్టుదల కాశ్మీరీలలో 1947 నుండి ఉంది. 40 ఏళ్లకు పైగా అది శాంతియుతంగానే వ్యక్తం అయింది. అటువంటిది 1989లో అది మిలిటెంట్ రూపం ఎందుకు తీసుకుంది? దానికి పాకిస్తాన్ సహాయసహకారాలు అందిస్తున్న మాట వాస్తవమే. కానీ తీసుకునే వాళ్లుంటేనే ఇచ్చేవాళ్లు ఇయ్యగలరు. సుశిక్షితమైన భారత సైన్యంతో సాయుధంగా తలపడాలన్న నిర్ణయానికి కాశ్మీరీ యువకులు ఎందుకు వచ్చారు?

ఈ సాయుధ సంఘర్షణ ఇప్పటికి 12 ఏళ్లుగా సాగుతున్నది. అధికార గణాంకాల ప్రకారమే అందులో 40 వేల మంది చనిపోయారు. మృతులలో మూడింట రెండు వంతులు ప్రభుత్వ సాయుధ బలగాల చేతిలో చనిపోగా ఒక వంతు మిలిటెంట్ల చేతిలో చనిపోయారు. కాశ్మీర్ యావత్తు ఒక సైనిక క్యాంపుగా మారింది. అర్ధరాత్రి అరెస్టులు, అతిక్రూరమైన చిత్రహింసలు, నెలల తరబడి నిర్బంధాలు, బూటకపు ఎన్‌కౌంటర్‌లు, కస్టడీ మరణాలు, మిలిటెంట్ల చేతిలో నిరాయుధులయిన సాధారణ పౌరుల హత్యలు- ఇవన్నీ ఒక దశాబ్దం పైగా నిరాఘాటంగా సాగుతున్నాయి. ఈ నిర్బంధం ఏ మోతాదులో ఉందో మేము మొన్నటి వేసవిలో స్వయంగా పరిశీలించాము. ఇది కాశ్మీర్ ప్రజల పైన ఎటువంటి ప్రభావాన్ని కలిగించిందో మనకు తెలుసా?

ఇవీ ఇత్యాది విషయలూ దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు చెప్పడానికీ, వారి అభిప్రాయాలు తెలుసుకోవడానికీ హురియత్ కాన్ఫరెన్స్ ప్రతినిధి బృందమొకటి దేశమంతా పర్యటిస్తున్నది.

హురియత్ కాన్ఫరెన్స్ ఒక రాజకీయ సంస్థ అని మొదటే చెప్పాము. రాజకీయ సంస్థలకు రాజకీయ లక్ష్యాలుంటాయి, వ్యూహాలు ఉంటాయి, ఎత్తుగడలుంటాయి. వాటన్నింటితోనూ హక్కుల సంఘాలుగా మేము ఏకీభవించకపోవచ్చు. అయినప్పటికీ కాశ్మీర్ విషయంలో ఒక పక్షం గొంతును మాత్రమే వింటున్న మనం రెండవ గొంతును కూడా వినడం అవసరం అని మేము భావిస్తున్నాము. వారేం చెప్తున్నారో వినకుండా వారికి ఏదో ముద్ర వేయడం న్యాయం కాదు.

అందువల్ల హురియత్ నేతల ప్రసంగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. అందరూ రండి, వినండి, చర్చించండి, మన దేశ భవితవ్యానికి సంబంధించిన అతి ముఖ్యమైన సమస్యలలో ఒకటైన కాశ్మీర్ సమస్య గురించి అవగాహన పెంచుకోండి-

**-మానవహక్కుల వేదిక (HRF)**

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)**

**ప్రజాస్వామ్యహక్కుల పరిరక్షణ సంస్థ (OPDR)**

ప్రచురణకర్త: ఎస్. జీవన్‌కుమార్, 3-12-117/ఎ2/1, పిఎస్ కాలనీ, రామాంతపూర్, హైదరాబాద్-13.